# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని లక్షా 30 వేల ప్రాంతాల్లో ఈ శనివారం యోగాంధ్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ తో ఎవరికీ ఎటువంటి నష్టం ఉండదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ లాసెట్-2025 పరీక్షా ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.
- అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ నగరం సన్నద్ధమవుతోంది.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21న ఒక లక్షా 30 వేల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు ఆయన యోగాంధ్ర 2025పై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులకు యోగాంధ్ర వివరాలను తెలియజేస్తూ... వచ్చే శనివారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. గత నెల 21 నుంచే యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యోగాంధ్రలో 2 కోట్ల మందిని భాగస్వామ్యం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే 2 కోట్ల 39 లక్షల మంది నుంచి విశేష స్పందన లభించిందని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు ఆ రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్ ను కలిసి తమ అభ్యంతరాలను తెలియజేసారు. ఈ నేపధ్యంలో కొద్ది సేపటి క్రితం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ పై వివరణ ఇస్తూ...

(వాయిస్ 42 సెకన్లు)

==========================

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ లాసెట్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. లాసెట్, పీజీఎల్‌సెట్ ఫలితాలను విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ఈరోజు మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 95 శాతం ఉత్తీర్ణత నమోదైందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన వెల్లడించారు. లాసెట్ పరీక్షకు మొత్తంగా 27 వేల 253 మంది దరఖాస్తు చేసుకోగా.. 20 వేల 826 మంది అర్హత సాధించారని మంత్రి పేర్కొన్నారు. కాగా శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన ఏపీ లాసెట్-2025 పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు.

==========================

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 21న నిర్వహిస్తోన్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ బీచ్ రోడ్ లో ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈరోజు పెందుర్తి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా ఆవశ్యకతను, యోగా దినోత్సవ ఏర్పాట్లను వివరించారు. జూన్ 21న శనివారం ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు విశాఖలోని ఆర్కే బీచ్ పొడవునా దాదాపు 5 లక్షల మందితో యోగా సాధన కార్యక్రమం ఉంటుందన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరాల్లో 2 కోట్ల మంది యోగా సాధన చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. యోగాను ఒక్కరోజుకే పరిమితం చేయకుండా దాని గొప్పతనాన్ని ప్రజలందరికీ వివరించి అన్ని వర్గాల ప్రజలు తమ తమ జీవితంలో భాగం చేసుకునేలా పలు కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజులుగా నిర్వహించిందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు జూన్ 21 తర్వాత కూడా యోగా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

విరామం

==========================

మహిళల సమస్యలను పరిష్కరించేందుకు తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్ కార్యక్రమంలో ఈరోజు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ పాల్గొన్నారు. ఈరోజు 56 కేసులు విచారించి సత్వర పరిష్కారం చూపించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... గృహ హింస బాధితులకు న్యాయం చేకూరేలా పోలీస్ స్టేషన్లకు దిశానిర్దేశం చేశామని.. అధికంగా గృహ హింస కేసులే పోలీస్టేషన్ లలో నమోదవుతున్నాయని చెప్పారు. ఆదరణ లేని మహిళలకు మహిళా కమిషన్ బాసటగా నిలుస్తుందన్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు ఈ నెల 21న విశాఖపట్టణం వేదికగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని, సాగరతీరంలో సరికొత్త రికార్డు సృష్టించేందుకు సహకరించాలని రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, సత్యకుమార్ యాదవ్, ఎస్.సవిత పిలుపునిచ్చారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు ఉదయం విశాఖలోని ఆర్కే బీచ్ రోడ్ లో ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు వాక థాన్ నిర్వహించారు. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి విశాఖపట్టణం ప్రతినిధి పి.శ్రీను బాబు అందిస్తారు.

(వాయిస్ 38 సెకన్లు)

==========================

తోతాపురి మామిడికి మద్దతు ధరకన్నా తక్కువ చెల్లించేవారిపై చర్యలు తీసుకుంటామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఈరోజు గంగాధర నెల్లూరులోని పలు పరిశ్రమలను కలెక్టర్ స్వయంగా సందర్శించి మామిడి కొనుగోలు ప్రక్రియపై పరిశ్రమ యాజమాన్యం, రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేర తోతాపురి మామిడికాయలకు మద్దతు ధర చెల్లించాలని, వర్తకులు, రైతులను ఇబ్బందికి గురి చేయవద్దని తెలిపారు. మద్దతు ధరకంటే తక్కువగా చెల్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుజ్జు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

===========================

ఆంధ్రప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు  వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో కొన్ని చోట్ల రాగల మూడు రోజులు తేలికపాటి నుండి ఒక  మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం కొన్ని చోట్ల ఏర్పడుతుందని పేర్కొంది.

===========================

===========================